క్లుప్తంగా

బడ్జెట్‌లో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం

ఏలూరు (టూటౌన్‌): కేంద్ర ప్రభుత్వం 2025– 26కు ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్లో చేనేత రంగాలకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి చేనేత కార్మికులను తీవ్ర నిరాశకు గురి చేసిందని ఏపీ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆది శేషు ఆదివారం ఓ ప్రకనలో ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వ్యవసాయ రంగం తరువాత అత్యధిక మందికి ఉపాధి కల్పించే చేనేత రంగాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించడం చాలా అన్యాయమని ఆయన తెలిపారు.ఎన్నికల ముందు చేనేత రంగానికి రూ.5 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి నేడు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి చేనేతకు తీవ్ర అన్యాయం చేశారని ఆదిశేషు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంతా కార్పొరేట్ కోసమే తప్ప సామాన్యులకు కాదని ఆయన విమర్శించారు. చేనేత కార్మికుల సమస్యలపై త్వరలో ఉద్యమం చేపడతామని ఆదిశేషు హెచ్చరించారు.

అన్ని రంగాల అభివృద్ధే ధ్యేయంగా కేంద్రం బడ్జెట్

ఏలూరు (టూటౌన్‌): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదోసారి ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని రంగాల అభివృద్ధే ధ్యేయంగా ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 50.65 లక్షల కోట్ల బడ్జెట్ పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ముద్రగడ ఇంటిపై దాడి దుర్మార్గం

దెందులూరు: కాపు నేత, రాష్ట్ర మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడి దేనికి సంకేతమని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు దెందులూరు నియోజకవర్గం కాపు సంఘం అధ్యక్షుడు పోకల రాంబాబు, సీనియర్ నేత తోట పద్మారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నివాసంలో మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం ఇంటి గేటుతోపాటు అక్కడే ఉన్న కారును ట్రాక్టర్‌తో ఢీ కొట్టారన్నారు. ముద్రగడ బెదిరింపులకు భయపడే వ్యక్తి కాదని పద్మారావు అన్నారు. దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. పోలీసులు విచారణ చేసి నిందితులను, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాపు సంఘ నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాపు ఉద్యమానికి ముద్రగడ కుటుంబం చేసిన సేవలు రాష్ట్రమంతా గుర్తుంచుకుంటుందన్నారు. కక్షపూరిత ధోరణితో దాడులు, దౌర్జన్యం చేయటం సిగ్గుచేటన్నారు. ముద్రగడ కుటుంబానికి అండగా ఉంటామని రాంబాబు, పద్మారావు అన్నారు.

తాగునీటి సరఫరా వ్యవస్థ అధ్వానం

- నిరుపయోగంగా తాగునీటి ట్యాంకులు
- చాటపర్రు చెరువులో చేపల సాగు
- అటకెక్కిన జలజీవన్ మిషన్


నిరుపయోగంగా మారిన ఓవర్‌హెడ్ ట్యాంకులు


చేపల చెరువుగా మారిన తాగునీటి చెరువు

ఏలూరు రూరల్: చాటపర్రులో తాగునీటి సరఫరా వ్యవస్థ అధ్వానంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. జలజీవన్ పథకం ద్వారా చేపట్టిన ఇంటింటికీ కుళాయి కార్యక్రమం ఎందుకూ పనికి రాకుండా పోతోంది. కూటమి ప్రభుత్వం రాకతో స్థానిక పాలనా వ్యవస్థ నిస్తేజంగా మారిపోయింది. దీంతో టీడీపీ నాయకులు తాగునీటి చెరువులో చేపల సాగు ప్రారంభించారు.

చేపల పెంపకంతో తాగునీరు కలుషితం

కొద్ది నెలలుగా గ్రామ పాలన కూటమి నాయకుల కనుసన్నల్లో సాగుతోంది. పంచాయతీ కార్యదర్శి నుంచి సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య సిబ్బంది వరకూ నాయకులను మెప్పించే విధంగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని అవకాశంగా తీసుకుని పలువురు పచ్చనేతలు గ్రామంలో తాగునీటి చెరువుపై కన్నేసారు. సుమారు 40 ఎకరాల విస్తీర్ణం గల చెరువును చేపల చెరువుగా మార్చేసారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువులో చేపలకు మేత సైతం వేస్తున్నారు. దీంతో చెరువులోని నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి చెరువులో చేపల సాగుపై అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకునే నాథుడు కానరావడం లేదని పలువురు వాపోతున్నారు.

నిరుపయోగంగా అభివృద్ధి పనులు

గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసిన తాగునీటి వ్యవస్థ నేడు నిరుపయోగంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రూఅర్బన్ పథకం ద్వారా రూ.1.28 కోట్లతో అధికారులు రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. మరో 62.76 లక్షలు జలజీవన్ మిషన్ పథకం నిధులతో గ్రామం అంతటా ప్రత్యేక పైప్‌లైన్ వేసి ఇంటింటికీ తాగునీటి కుళాయిలు బిగించారు. దీనికి తోడు లక్షల రూపాయల మండల పరిషత్ నిధులతో ఫిల్టర్ బెడ్లు అభివృద్ధి చేసారు. అయినప్పటికీ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నేటికీ ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగునీటి పైప్‌లైన్, ఫిల్టర్‌బెడ్లను పూర్తిస్థాయిలో అనుసంధానించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

రాష్ట్రపతి అవార్డు గ్రహీత జెస్సీకి సత్కారం



జెస్సీరాజును సత్కరిస్తున్న డాక్టర్ ఫాదర్ పీ బాల

దెందులూరు: రాష్ట్రపతి అవార్డు గ్రహీత జెస్సీరాజు ఆదివారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యా సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి బాల పూల కిరీటం, శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపకను అందజేశారు. జెస్సీలోని ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు స్కేటింగ్‌లో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. స్కేటింగ్‌లో సాధించిన ఇంటర్నేషనల్ అవార్డుతో పాటు రాష్ట్రపతి అవార్డు, ప్రధానమంత్రి సంతకం చేసిన జ్ఞాపికను వికార్ జనరల్ డాక్టర్ బాలకు జెస్సీరాజు చూపించారు. జోగన్నపాలెం గ్రామాన్ని ఢిల్లీ స్థాయిలో ఇనుమడింపజేసి స్వగ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చావని, మరింత పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జెస్సీరాజ్‌కు ఫాదర్ సూచించారు.

కమ్ముకున్న మంచు తెరలు


మన్యం వీరుడిపై మంచు తెరలు

వేకువ జామున నగరాన్ని మంచు కమ్ముకున్న కమనీయ దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ ఏడాది శీతాకాలంలో ఇప్పటి వరకూ చూడని మంచు తెర దుప్పటిలా నగరంపై పరుచుకుని ఆహ్లాదాన్ని పంచుతోంది. ఎటు చూసినా కనుచూపు మేరలోని భవంతులు, రహదారులు కానరాని పరిస్థితి నెలకొంటోంది. వాహనాల హెడ్‌లైట్ల నుంచి వెలువడిన కాంతి కిరణాలు మంచును తాకి పంచవర్ణశోభితంగా దర్శనమిస్తున్నాయి. సుమారు ఉదయం 8 గంటల సమయంలో కళాశాలల విద్యార్థులు, నిత్యం పనికి వెళ్లే శ్రామికులు, ఉద్యోగాల నిమిత్తం బయటకు వచ్చిన వారికి మంచు తరలను చీల్చుకుంటూ వచ్చే సూర్య కిరణాలు కనువిందు చేస్తున్నాయి. పొగ మంచు కమ్మేయడంతో వాహనదారులు ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నారు. - ఏలూరు (ఆర్ఆర్‌పేట)


తెల్లవారుజామున పొగ మంచు


ఉదయం 8 గంటలకు మంచుతెరను చీల్చుకుంటూ దూసుకొస్తున్న భానుడు


రైల్వే ట్రాక్‌ను కమ్మేసిన పొగ మంచు

ఎట్టకేలకు రహదారి మరమ్మతులు ప్రారంభం


భీమడోలు రైల్వే జంక్షన్ నుంచి గేటు వైపు రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

భీమడోలు: రాష్ట్రీయ రహదారి భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రెండు నెలల క్రితం నుంచి నిలిచిపోయిన పనులను కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత కాంట్రాక్టర్ తిరిగి పనులు చేపట్టారు. గతేడాది నవంబర్‌లో రహదారిపై ఏర్పడిన భారీ గోతులను పూడ్చేందుకు రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీనితో గుంతలు పూడ్చివేత కార్యక్రమాన్ని చేపట్టి డివైడర్‌లోని ఒకవైపు పనులు పూర్తి చేసారు. పూర్తయిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడం, రోడ్డు మరమ్మతుల పనుల నాణ్యతపై ఫిర్యాదులు అధికారులకు అందడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సాక్షిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనితో ఆర్‌అండ్‌బీ రోడ్డును సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించారు. ఇదే తరుణంలో జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు ఈనెల 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. దీనితో ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు తిరిగి చేపట్టారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ జే భాస్కరరావు వివరణ కోరగా కూలీల కొరత వల్లే రోడ్డు మరమ్మతులు పనులు నిలిచాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులను కాంట్రాక్టర్ చేపట్టారన్నారు. రెండు, మూడు రోజుల్లో గుంతలు పూడ్చే పనులు పూర్తవుతాయన్నారు.

చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


భీమడోలులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు

భీమడోలు: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ హలో మాదిగ చలో హైద్రరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు లక్షల డప్పులు.. వేయి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లాల ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ అన్నారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని అరుంధతీ కాలనీలో ఆదివారం సాయంత్రం ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు కొత్తపల్లి చంద్రమౌళి అధ్యక్షతన సమావేశం వహించారు. ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జి బయ్యారపు రాజేశ్వరరావు, జిల్లా నాయకులు మాముడూరి ఏలియా మాదిగ, కాటూరి జోగేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. నాయకులు దూలపల్లి రత్నకరాజు, భీమడోలు గాంధీ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	10
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	16
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	23
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	07
ఏలూరు - తిరుపతి	16.00	4830	33
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	24	బిక్షచిక్కుడు	52
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	30	కంద	68
కాకర కాయలు	34-40	బీట్‌రూట్	34
బీరకాయలు	38	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	46	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	36	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	07-10
దోసకాయలు	28-34	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన


ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన సీఐ, ఎస్సై

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 68వ ఆలయ ఉత్సవ ఏర్పాట్లను ఆదివారం పెదవేగి సీఐ శ్రీనివాసరావు, దెందులూరు ఎస్సై శివాజీ పరిశీలించారు. ఫిబ్రవరి 4 నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఏ రాష్ట్రాల నుంచి భక్తులు ఎంతమంది వస్తారు, మార్గాలు ఎన్ని ఉన్నాయి, తాగునీరు, పార్కింగ్, వైద్యం, మరుగుదొడ్ల ఏర్పాటును పరిశీలించారు. పోలీస్ పికెట్‌తో పాటు అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలను ఆలయ కమిటీ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఊరేగింపు


నారాయణపురంలో భూదేవి ,శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

ఉంగుటూరు: నారాయణపురంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఆదివారం మేళ తాళాలతో బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపు కొనసాగింది. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి : రాట్నాలమ్మకు భక్తులు విశేష పూజలు చేశారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన అమ్మవారికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల ద్వారా రూ.43,670, విరాళాలు రూ.24,183, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.21,000, ఫొటోల విక్రయం ద్వారా రూ. 4,345, మొత్తం రూ.93,198 ఆదాయం లభించిందని కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ తెలిపారు.

అర్హులందరికీ తక్షణం ఇంటి స్థలం కేటాయించాలి


అర్జీల నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

ఏలూరు (టూటౌన్‌): కూటమి నాయకులు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానం మేరకు తక్షణమే ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), ఏలూరు 2వ డివిజన్‌లో అడ్డగర్ల లక్ష్మీ ఇందిర ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ అర్జీల నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పేదలు పట్టణ ప్రాంతంలో సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పట్టణ ప్రాంతాల్లో సెంటు భూమిని రెండు సెంట్లుగా మార్పు చేసి, పట్టాలు జారీ చేయాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న పూర్తి చేసిన అర్జీలను కలెక్టర్‌కు అందించే కార్యక్రమంలో లబ్ధిదారులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏలూరు జిల్లా సమితి సభ్యులు బళ్ల కనక దుర్గారావు, గొర్లి స్వాతి, ఉప్పులూరి లక్ష్మి పాల్గొన్నారు.

బహుజన కులాల ఐక్యతతోనే రాజ్యాధికారం


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పంరజ్యోతి

ఏలూరు (టూటౌన్‌): బహుజన కులాలు ఐక్యత ద్వారానే రాజ్యాధికారం సాధించగలుగుతామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పంరజ్యోతి అన్నారు. బీఎస్పీ ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల సమీక్షా సమావేశం స్థానికంగా ఉన్న ఓ ప్రైయివేట్ పంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ఏలూరు పార్లమెంటు సమన్వయ కర్త ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ఏడీ పాల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి మాట్లాడుతూ బహుజన కులాలను ఐక్యం చేసి రాజ్యాధికారం సాధించే దిశగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామన్నారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామని తెలిపారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు నేతలు రమేష్ బాబు, గుదే రాంబాబు, సీహెచ్ సాయిరాజు, అందుగుల రతన్ కాంత్, దాసి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తికావడంతో ఆదివారం సాయంత్రం నుంచి రైల్వే అధికారులు వాహనాల రాకపోకలకు అనుమతించారు. 10 రోజుల తర్వాత ఈ గేటు ద్వారా వాహనాల రాకపోకలు పునఃప్రారంభం కావడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. గత నెల 22న ట్రాక్ మరమ్మతుల కారణంగా రైల్వే గేటును ఉన్నతాధికారులు మూసివేసారు. దీనితో రైల్వే శాఖ ఈ ట్రాక్ మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి గడువు సమయం కన్నా ఒక రోజు ముందుగానే పూర్తి చేసారు. అనంతరం వాహనాల రాకపోకలు సాగించేందుకు అనుమతిచ్చారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేగా ఆదివారం రూ. 2,00,005 విరాళంగా అందజేశారు. గణపవరానికి చెందిన ఎస్వీ సుబ్బారావు, తాళ్లముదునూరుపాడుకు చెందిన సత్తి శ్రీనివాసరెడ్డి విరాళాలు అందజేశారు.